క్లుప్తంగా

పేదలకు భరోసా సీఎంఆర్‌ఎఫ్



జుబేదాకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న చైర్‌పర్సన్ సునీతారెడ్డి

ధారూరు: ముఖ్యమంత్రి సహాయ నిధి సామాన్య ప్రజలకు ఎంతో భరోసా కల్పిస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. దోర్నాల్ గ్రామానికి చెందిన జుబేదాబేగంకు గురువారం రూ.30 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆమె అందజేసి మాట్లాడారు. గుండెకు సంబంధించిన సమస్యతో జుబేదా ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొంది కోలుకున్నారని ఆమె తెలిపారు. కార్యక్రమంలో వీఎస్ ఫౌండేషన్ చైర్మన్ వడ్లనందు, బీఆర్‌ఎస్ నాయకుడు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శనైశ్చర విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో కొలువుదీరిన స్వామివారు

యాలాల: సంగెంకుర్దు శివారు సంగమేశ్వర ఆలయం పక్కన నూతనంగా నిర్మించిన శనీశ్వర ఆలయంలో ఐదు రోజులుగా కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం గురువారంతో ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కాగా బుధవారం రాత్రి ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు, విగ్రహానికి పూర్ణాహుతితో ప్రాణప్రతిష్ఠ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీలత, మాజీ ఏఎంసీ వైస్‌చైర్మన్ అనంతయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు హన్మంతు, మాజీ ఎంపీటీసీ శంకర్, బస్వరాజ్, లాలప్ప తదితరులు ఉన్నారు.

కన్నడనాట కుల్కచర్ల నేతల ప్రచారం




పార్టీలో చేరిన మహిళలతో ప్రహ్లాదరావు

కుల్కచర్ల: కర్ణాటకలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ కుల్కచర్ల నేతలు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మండలానికి చెందిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావుని సిరగుప్ప అసెంబ్లీ నియోజకవర్గానికి ఇన్‌చార్జిగా నియమించడంతో ఐదురోజులుగా అక్కడే ఉంటూ ప్రచారం ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా గురువారం పలువురు మహిళలు పార్టీలో చేరగా.. వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మోత్కూరు సర్పంచ్ కేశవులు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడు వెంకటయ్య, సీనియర్ నాయకుడు నర్సింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం

దోమ: కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటామని పరిగి మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తనయుడు, యువ నాయకుడు రితిక్‌రెడ్డి అన్నారు. గురువారం కిష్టాపూర్ గ్రామానికి చెందిన పాలేపల్లి వెంకటయ్య అనారోగ్యంతో మృతి చెందగా.. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో బాధిత కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్‌రెడ్డి, ఎంపీటీసీ చారి, సీనియర్ నాయకుడు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

సలావుద్దీన్‌కు పురస్కారం



పురస్కారం అందుకుంటున్న సలావుద్దీన్

బంట్వారం: బొప్పునారం గ్రామానికి చెందిన సామాజిక జానపద కళాకారుడు డాక్టర్ ఎండీ సలావుద్దీన్‌కు అరుదైన గౌరవం దక్కింది. తెలంగాణ భాష సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన.. ప్రముఖుల చేతుల మీదుగా వందే భారత్ భీష్మ విశిష్ట పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తంచేస్తూ సలావుద్దీన్‌ను అభినందించారు.

నిరుపయోగంగా క్రీడా ప్రాంగణాలు

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడానికి రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. గ్రామాల్లో అరకొర ప్రాంగణాలు ఏర్పాటు చేసినప్పటికీ.. వసతులు కల్పించడంలో విఫలం కావడంతో వినియోగించుకోవడానికి క్రీడాకారులు ఉత్సాహం చూపడం లేదు. దీంతో అవి నిరుపయోగంగా మారగా.. మరి కొన్ని చోట్ల స్థల సేకరణ కష్టంగా మారి మైదానాల ఏర్పాటు ప్రశ్నార్థకంగా మారింది.

- మైదానాలున్నా.. పరికరాలు సున్నా
- వినియోగించుకోవడానికి ముందుకు రాని క్రీడాకారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం



సాల్వీడు చెరువులో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం

కుల్కచర్ల: గ్రామీణ యువత క్రీడల్లో రాణించేలా గ్రామానికో క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది. యువత క్రీడల్లో రాణిస్తే.. దేహదారుఢ్యంతో పాటు ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని మైదానాల ఏర్పాటుపై దృష్టి సారించింది. ప్రాంగణాల ఏర్పాటుకు ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తున్నా.. క్షేత్ర స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. ప్రాంగణాలు ఏర్పాటు చేసినా.. వసతుల కల్పనలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. కుల్కచర్ల మండలంలో 44 గ్రామపంచాయతీలు ఉండగా.. ఇప్పటివరకు కేవలం 15 జీపీలలో ప్రాంగణాల ఏర్పాటుకు అధికారులు ముందుకు వచ్చారు. ఇలా ఏర్పాటు చేసిన వాటిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించకపోవడం, గ్రామానికి దూరంగా ఉండటం, ప్రహరీ లేక మందుబాబులకు అడ్డాగా మారడంతో యువత ఆసక్తి చూపడం లేదు. ఇదిలా ఉండగా.. మైదానాల ఏర్పాటును రెండు విధాలుగా పేర్కొంటూ ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోంది. ఎకరా స్థలంలో అయితే సూమారు రూ.3 లక్షలు, అర ఎకరాలో అయితే రూ.1.40 లక్షలు కేటాయిస్తున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

వెంటాడుతున్న నిధుల లేమి!

మండల పరిధిలో 15 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేయగా.. ఏ ఒక్క దానికి నిధులు మంజూరు కానట్లు సమాచారం. నిధులు రాకపోవడంతో వాటి నిర్వహణకు ప్రజాప్రతినిధులు మొగ్గుచూపడం లేదు. ఒకటి రెండు క్రీడా పరికరాలు అమర్చి.. మమ అనిపిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కడ కూడా పెద్దగా వసతులు ఏర్పాటు చేసిన దాఖలాలు లేవని, దీంతో అవి ఎవరికీ ఉపయోగపడకుండా పోతున్నాయని, సౌకర్యాలు కల్పిస్తే యువత సద్వినియోగం చేసుకుంటుందని గ్రామస్తులు కోరుతున్నారు.

పనులు పూర్తైనా.. నిధులు రాలే



అప్పులు చేసి క్రీడా ప్రాంగణం నిర్మించాం. దానికి సంబంధించిన నిధులు మాత్రం ఇంత వరకు మంజూరు కాలేదు. త్వరలోనే డబ్బులు వస్తాయని అధికారులు చెప్తున్నారు కానీ.. రావడం లేదు. జిల్లా అధికారులు స్పందించి బిల్లులు త్వరితగతిన వచ్చేలా చూడాలి.

– విజయలక్ష్మి, సర్పంచ్ ఘనపూర్

స్థలం కేటాయించ లేదు



గ్రామంలో క్రీడా ప్రాంగణం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని తహసీల్దార్ మొదలు అడిషనల్ కలెక్టర్ వరకు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేదు. గ్రామ పరిధిలో జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులు ఉన్నప్పటికీ.. వారి సూచనలు యువతకు అందించడానికి అనువైన స్థలాలు లేక ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. మైదానం ఏర్పాటుకు స్థలం కేటాయించాలి.

– లక్ష్మి, సర్పంచ్, ముజాహిద్‌పూర్

త్వరలో నిధులు వస్తాయి..



తెలంగాణకు క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కార్యక్రమంలో భాగంగా మొదటి విడతలో కొన్ని గ్రామాలను ఎంపిక చేశాం. వాటిలో పూర్తి స్థాయిలో పనుల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. నిధులు త్వరలోనే వచ్చే అవకాశం ఉంది. గ్రామస్థాయిలో నెలకొన్న పరిస్థితులను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదిస్తున్నాం.

– వెంకటేశ్, ఏపీఓ, కుల్కచర్ల

ఘనంగా భగీరథ మహర్షి జయంతి



భగీరథ జయంతిలో సగర నాయకులు తదితరులు

పరిగి: భగీరథ మహర్షి జయంతి సందర్భంగా సగర సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణ కేంద్రంలో నిర్వహించిన వేడుకల్లో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ సగరుల కుల గురువు భగీరథ మహర్షి అని, ఆయన చరిత్రను ప్రతి ఒక్కరు తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు అనిల్‌రెడ్డి, ఎంపీపీ అరవింద్‌రావు, దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, నాగేశ్వర్, ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, సంఘం నాయకులు, దర్గోల్‌పల్లి సర్పంచ్ యాదయ్యసగర తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

తాండూరు టౌన్: గల్లీగల్లీకి పైలట్ పేరుతో శుక్రవారం మున్సిపాలిటీలోని వార్డుల్లో ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి పర్యటించనున్నట్లు బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నయీమ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 8గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. 1వ వార్డు నుంచి 8వ వార్డు వరకు మధ్యాహ్నం 1 గంటలోగా, మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు 19 నుంచి 26, 31, 32, 33 వార్డుల్లో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటారని వెల్లడించారు. అదే విధంగా వార్డుల అభివద్ధికి నిధులు కేటాయిస్తూ, పలు అభివద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయనున్నట్లు తెలిపారు.

ద్విచక్ర వాహనాల వేలం నేడు

కొడంగల్: పట్టణంలోని ఆబ్కారీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ద్విచక్ర వాహనాలను వేలం వేయనున్నట్లు ఆబ్కారీ సీఐ సైదులు తెలిపారు. ఇందులో పాల్గొనదలచిన వారు రూ.5వేలు డిపాజిట్ చెల్లించాలని చెప్పారు.

పైసలు లేకున్నా.. పనులు చేశాం

ధారూరు: నిధుల కొరత ఉన్నా.. పనుల్లో ఎలాంటి జాప్యం చేయలేదని, చేసిన అభివృద్ధి పనులకు పైసలు రావడం లేదని గడ్డమీది గంగారం సర్పంచ్ అమర్‌నాథ్ ఒక ప్రకటనలో వాపోయారు. 6 నెలల నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, అభివృద్ధి పనుల కోసం అప్పులు చేశామని చెప్పారు. రెండు నెలలుగా పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వలేక పోయామని సర్పంచ్ పేర్కొన్నారు.

వికారాబాద్‌లో చినుకులు

అనంతగిరి: వికారాబాద్ పట్టణంలో గురువారం రాత్రి చినుకులు పడ్డాయి. సాయంత్రం నుంచి వాతావరణం చల్లబడగా.. రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షం కురిసింది.

గ్రామాల అభ్యున్నతికి కృషిచేసింది కాంగ్రెస్ పార్టీనే



ఉత్సవాల్లో మాట్లాడుతున్న రుతిక్ రెడ్డి

కుల్కచర్ల: గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి కృషిచేసింది ఒక్క కాంగ్రెస్ పార్టేనని డీసీసీ ఉపాధ్యక్షుడు బీంరెడ్డి, రాష్ట్ర నాయకుడు రుతిక్ రెడ్డిలు అన్నారు. గురువారం దాస్యనాయక్ తండాలో కొనసాగుతున్న స్వయంబు పంచముఖ ఆంజనేయస్వామి అలయ వార్షికోత్సవంలో వారు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు నర్సింహ నాయక్, వెంకటేశ్, రఘునాథ్ రెడ్డి, తిరుపతయ్య, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల సమ్మె నోటీస్



ఎంపీడీఓ నాగవేణికి సమ్మె నోటీస్ అందజేస్తున్న జీపీ కార్యదర్శులు

కుల్కచర్ల: విధుల్లో చేరి నాలుగు సంవత్సరాలు (ప్రొబేషన్ పీరియడ్) పూర్తికావస్తున్నా క్రమబద్ధీకరించడం లేదని, వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు మండల పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ నాగవేణికి సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి విజయ్‌కుమార్‌లు మాట్లాడుతూ.. నాలుగేళ్లుగా గ్రామపంచాయతీల అభివృద్ధికి అవిశ్రాంతిగా పనిచేస్తున్న తమను ప్రభుత్వం గుర్తించకపోవడం బాధాకరమన్నారు. శాశ్వత ఉద్యోగులుగా గుర్తిస్తే అధికారికంగా లభించే సౌకర్యాలు పొందుతామని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, కార్యదర్శులు రవి, విజయ్ భాస్కర్, అశోక్‌కుమార్, రాఘవేందర్ రెడ్డి, జమీర్, రఘు, వెంకటయ్య, శైలజ, ఎల్లమ్మ, శోభ, రమాదేవి, అనూష తదితరులు పాల్గొన్నారు.

తిరుగులేని రాజకీయ శక్తిగా బీఆర్‌ఎస్



పార్టీ జెండాను ఆవిష్కరించిన నాయకులు

చేవెళ్ల: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ అతిపెద్ద పార్టీగా అవతరించిందని ఇప్పుడు దేశవ్యాప్తంగా పార్టీ విస్తరిస్తోందని పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ 23వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలో కలిసి గులాబీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 22ఏళ్లుగా పార్టీ ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొని రాష్ట్రంలో తిరుగులేని రాజకీయ పార్టీగా అవతరించిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పార్టీ అంచలంచెలుగా ఎదుగుతూ వచ్చిందని తెలిపారు. గ్రామస్థాయి వరకు పార్టీ బలంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రామగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బి.నర్సింహులు, ముడిమ్యాల సొసైటీ వైస్ చైర్మన్ మల్లేశ్, సర్పంచులు భీమయ్య, శ్రీనివాస్, మల్లారెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

మురుగునీటి శుద్ధి మెరుగుపడాలి



ఎస్‌టీపీ సెంటర్‌ను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ మంజుల తదితరులు

వికారాబాద్ అర్బన్: మురుగునీటి శుద్ధి మరింత మెరుగు పడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్ల పల్లి మంజుల అధికారులకు సూచించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ సుధాకర్ రెడ్డి, కమిషనర్ శరత్ చంద్రలతో కలిసి ఎస్‌టీపీ సెంటర్‌ను పరిశీలించారు. ఎస్టీపీలో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, పని తీరు మరింత మెరుగు పడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ ఫ్లోర్ లీడర్ సురేష్, మాజీ వైస్ చైర్మన్ రమేష్ కుమార్, మాజీ జెడ్పీటీసీ ముక్తార్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

బొంరాస్‌పేట: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సుభాష్ మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ షర్మిలకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోళ్లు ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు శివకుమార్, శేఖర్, రజనీకాంత్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

జగదీశ్వర్‌స్వామికి నంది పురస్కారం



అవార్డు అందుకుంటున్న జగదీశ్వరస్వామి

కొడంగల్ రూరల్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో తెలంగాణ సారస్వత్ పరిషత్ నిలయంలో శ్రీ త్రినయన సాంస్కృతిక కళా నిలయం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో టేకుల్‌కోడ్ గ్రామానికి చెందిన పురోహితుడు జగదీశ్వర్‌స్వామి నంది పురస్కారం అవార్డు అందుకున్నారు. శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది నంది పురస్కారం, శంకరాచార్యుల జయంతిని పురస్కరించుకొని బుధవారం రాత్రి నంది పురస్కారం, ఉత్తమ వైదిక పురోహిత రత్న బిరుదును అందుకున్నట్లు జగదీశ్వర స్వామి తెలిపారు. హైందవ సాంప్రదాయాలను పాటిస్తూ 26ఏళ్లుగా వైదిక కార్యక్రమాలు, జ్యోతిష్యం, పౌరోహిత్యం, ప్రతిష్ఠాపన వంటివాటిని నిర్వహిస్తూ అందరి మన్ననలు పొందిన నేపథ్యంలో ఈ అవార్డులు వరించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ధూపదీపనైవేద్య అర్చక సంఘం జిల్లా అధ్యక్షుడు లోకూర్తి జయతీర్థాచారి, సంఘం సభ్యులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

దోమ: గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నానని సర్పంచ్ మల్లేశ్ అన్నారు. గురువారం ఐనాపూర్‌లో ఎంపీటీసీ విజయతో కలిసి అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించి మాట్లాడారు. వీధుల్లో అండర్ డ్రైనేజీ, సీసీరోడ్లు, వీధి దీపాలు, నీటి వసతులతో పాటు పారిశుధ్యం మెరుగు పడేలా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నామని చెప్పారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బుగ్గయ్య, కులకచర్ల ఏపీఓ వెంకటేశ్‌గౌడ్, పాఠశాల చైర్మన్ సాయిలు, మాజీ ఎంపీటీసీ భీమయ్య, గ్రామస్తులు అంజిలయ్య, రాములు, బాబు, నర్సింహులు, మేకల అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

వాల్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

దౌల్తాబాద్: ఈ నెల 29న మాటూర్ గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించనున్న నేపథ్యంలో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వాల్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షుడు శ్యాంసుందర్ మాట్లాడుతూ విగ్రహావిష్కరణకు గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్, ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏసీఎఫ్ చైర్మన్ అశోక్, నాయకులు శ్రీనివాస్, అంజి, సాయిలు, భీంలు, హన్మంత్, మదారప్ప, వెంకటప్ప తదితరులు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోండి



దౌల్తాబాద్: శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ

దౌల్తాబాద్: అంధత్వ నివారణే లక్ష్యంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ మహిపాల్ అన్నారు. బుధవారం సుల్తాన్‌పూర్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగును ప్రారంభించి మాట్లాడారు. కంటి చూపుతో బాధపడేవారు నేత్ర శిబిరంలో కంటి పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీఓ రవీందర్, సర్పంచ్ బుడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

యాలాలలో..

యాలాల: తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని హాజీపూర్ సర్పంచ్ ఒంగోనిబాయి శ్రీనివాస్ అన్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన నేత్ర శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి శిబిరంలో గ్రామస్తులు కంటి పరీక్ష చేయించుకొని, ఉచితంగా మందులు, కళ్లద్దాలు పొందాలని సూచించారు.

అన్నదాతకు వడగండ్ల ముప్పు

- వాతావరణశాఖ హెచ్చరికతో ఆందోళన
- ఉరుముతున్న వరుణుడు
- మరో వారం రోజులైతేనే కోతకు సిద్ధం
- నేల వాలినా, రాలినా నష్టమే..



ధారూరులో చేతికి వచ్చిన వరిపంట

ధారూరు: వరి రైతుకు కడగండ్లు తప్పేలా లేవు. నిత్యం ఈదురు గాలులు వీయడం, చేతికి వస్తున్న వరిపంట నేల రాలడం షరా మామూలైంది. దీనికి తోడు అకాల వర్షాలు కర్షకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మూడు రోజులుగా ధారూరు మండలంలో వర్షాలు, ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు భయాందోళనలకు గురిచేస్తున్నాయి. ఈ వానలకు చేతికి వచ్చిన పంట పాడయిపోయి, నష్టం వాటిల్లుతుందేమోనన్న భయం రైతులను వెంటాడుతోంది.

4,646 ఎకరాల్లో వరి సాగు..

మండల పరిధిలో 3,019 రైతులు 4,646 ఎకరాల్లో వరి సాగుచేశారు. ప్రస్తుతం కోత దశకు చేరువలో ఉంది. మరో రెండు మూడు రోజుల వరకు వర్షాలు పడే అవకాశాలు ఉన్నట్లు వాతావరణశాఖ పేర్కొనడంతో అన్నదాతలు ఆందోళనకు గురవుతున్నారు. ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు పడితే.. చేతికి వచ్చిన వరిపంట పొలాల్లోనే గింజ రాలిపోయే ప్రమాదం ఉందని భయాందోళన చెందుతున్నారు. దీంతో పెట్టిన పెట్టుబడులు రాక.. చేసిన అప్పులు తీర్చలేక అవస్థలు పడాల్సి వస్తుందేమోనని పేర్కొంటున్నారు. ఇప్పటికే వానలు పడటం వలన వరి పొలాలన్నీ తడిసి ఉన్నాయని, పంటను కోసేందుకు పొలాల్లోకి హార్వెస్టర్ మిషన్ రాని పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు. పొలాలు తడిగా ఉండటంతో కూలీల ద్వారా కోయించే పరిస్థితి లేదని, ధైర్యం చేసి కోయిస్తే వానలు దెబ్బతీసే ప్రమాదం ఉందంటున్నారు. ఒక వేళ కోత కోయించి రాశులు పోస్తే.. వాన పడితే తడిసిపోయి ఫంగస్‌తో పాటు బూజు వచ్చే అవకాశం ఉందని అన్నదాతలు చెబుతున్నారు. అకాల వర్షాలు తమకు గండంగా మారాయని, చేతికి వచ్చిన పంట పొలంలోనే దెబ్బతింటే తమ పరిస్థితి దీనంగా మారుతుందని కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

వరుణుడి దయ..



రెండు ఎకరాల్లో వరిని సాగుచేశాను. ఈదురు గాలులు, వాన, వడగండ్లు లాంటివి అసలే రాకూడదు. వస్తే రైతులు ఆర్థికంగా నష్టపోయి, చేసిన అప్పులు తీర్చలేక సతమతమౌవుతారు. వరుణుడి కరుణపై ఆధారపడి ఉన్నాం. ఆయన దయ.

– రైతు బుజ్జయ్య గౌడ్, ధారూరు